సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 1 । జనవరి । 2025



పోలీస్ కొలువులకు పరీక్షలు

కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ ఏలూరులో రెండోరోజు మంగళవారం కూడా కొన సాగింది. ఎస్పీ శివకిషోర్ అభ్యర్థుల సర్టిఫికె ట్లను స్వయంగా పరిశీలించారు. IIలో ▸



దొంగల ముఠా అరెస్ట్

అంతర్ జిల్లా దొంగల ముఠాను నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ అధికారులు పట్టుకున్నారు. రూ.1.62 కోట్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. IIలో ▸



పోటెత్తిన పాదయాత్ర భక్తులు

శ్రీవారి క్షేత్రానికి మంగళవారం పాదయాత్ర భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా డిసెంబర్ 31న నూతన సంవత్సరం తొలి రోజు కాలినడకన స్వామివారిని దర్శించుకుంటారు. IIలో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దుప్పల వెంకట రమణకు స్వామి మెమెంటోను అందజేస్తున్న ఆలయ డీఈఓ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకట రమణ మంగళవారం ఉదయం సందర్శించారు. సతీసమేతంగా ఆల యానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవ స్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామి వారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక నాయకులు

భీమవరం: ఎస్సీ కులగణనలో అభ్యంతరాలు న్నాయని వాటిని పరిశీలించి ఎస్సీ కుల సర్టిఫి కెట్స్ జారీ చేయాలని కలెక్టర్ చదలవాడ నాగ రాణికి ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య వినతి పత్రం అందజేశారు. క్రైస్తవ మతం స్వీకరించిన ఎస్సీలు ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కుల సర్టిఫికెట్ పొందుతున్నారని రాజ్యాంగం ప్రకారం ఇది చెల్లదన్నారు. కుల సర్టిఫికెట్లు ఇచ్చే సమయం లో ఎస్సీ హిందూ అని రాయడంతో పాటు వారి ఉపకులాన్ని కూడా పొందుపర్చాలని కోరుతున్నట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాడుగుల దుర్గాప్రసాద్, అడపా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలతో 2025లోకి..



పాలకొల్లు : పూలదుకాణం వద్ద జనం రద్దీ



ఆకివీడు : జోరుగా బిర్యానీ అమ్మకాలు



ఏలూరు : ఎన్ఆర్‌పేటలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కొత్త సంవత్సర సంబరాలు నింగినంటాయి. కుర్రకారు కేరింతలు, కేక్ కటింగ్‌లు, బాణసంచా పేలుళ్లతో 2025కు స్వాగతం పలికారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఇళ్ల ముంగిట మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు కనువిందు చేశాయి. ఇక కేక్‌లు, బిర్యానీలు, రంగవల్లుల కోసం, ముగ్గుల కొనుగోలుతో మార్కెట్లన్నీ కళకళలాడాయి. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరించాలని ఆకాంక్షిస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్

జిల్లా కేంద్రం తరలింపు?

- భీమవరం నుంచి మార్పునకు ప్రయత్నాలు
- మార్కెట్ యార్డులో 20 ఎకరాలు కేటాయించిన గత సర్కారు
- రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు టెండర్లు పూర్తి
- గత ప్రభుత్వానికి పేరు వస్తుందని కుట్ర రాజకీయాలు
- ఉండి మండలం పెదఅమిరంలో స్థలాలు పరిశీలించిన జేసీ



భీమవరంలోని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: భీమవరం జిల్లా కేంద్రం తరలింపు వ్యవహారం రాజకీయ ప్రకంపనాలు సృ ష్టిస్తుంది. గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే సాకుతో ఏకంగా భీమవరం నుంచి జిల్లా కేంద్రాన్ని ఉండికి తరలించేందుకు కూటమి నేతలు కుట్ర పన్నుతున్నారు. ఇప్పటికే స్థల కేటాయింపు, రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి కావడం జరిగాక.. కేవలం రాజకీయ కారణాలతో తరలింపునకు కూటమి నేతలు ప్రయ త్నించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొద్దిరోజులు క్రితం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు జిల్లా కేంద్రాన్ని తరలిస్తున్నామ ని, దీని కోసం 60 ఎకరాల భూసేకరణ చేస్తామని ప్రకటించారు. రియల్ ఎస్టేట్, ఇతర వ్యక్తిగత ఎజెం డాతోనే ఇలా చేస్తున్నారంటూ తీవ్ర దుమారం రేగింది. భీమవరంలోనే జిల్లా కేంద్రం ఉంటుందని, అవసరమైతే భీమవరంలోనే వేరే ప్రాంతానికి మారుస్తామంటూ మళ్లీ చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం తరలింపుపై గత 20 రోజులుగా తీవ్ర స్థాయిలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. గత వారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఉం డి నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు చెందిన మూడున్నర ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కలె క్టరేట్‌కు, మిగలిన శాఖల భవన నిర్మాణాలకు స్థలం సరిపోతుందా? లేదా? అనే అంశాలు పరిశీలిం చారు. భీమవరం నుంచి ఉండి నియోజకవర్గానికి జిల్లా కేంద్రం మారుతుందనే వాదన బలంగా వ్యక్తం కావడంతో సోషల్ మీడియాలో రాజకీయ పక్షాలు తీవ్రంగా స్పందించాయి. వైఎస్సార్‌సీపీ ఈ ప్రయత్నాలను అడ్డుకుంటామని ప్రకటించింది.

రెండేళ్ల క్రితం ఏర్పాటు

పరిపాలనా సౌలభ్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. కొత్త పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. జిల్లాకు మధ్యలో ఉండటం, అం దరికి అందుబాటులో ఉండటంతో భీమవరాన్ని ఎంపిక చేశారు. అద్దె భవనంలో 2022 ఏప్రిల్ 4న కలెక్టరేట్‌ను ప్రారంభించారు. శాశ్వత ప్రాతిపదికన జిల్లా కేంద్రం ఉండాలనే యోచనతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ప్రతిపాదన ఖరారు చేశారు. దీనిలో భాగంగా 20 ఎకరాల్ని భీమవరంలోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డు స్థలాన్ని అప్పటి కలెక్టర్ ప్రశాంతి ఎంపిక చేశారు. ప్రతిపాదనలు ప్రభుత్వా నికి పంపి మార్కెటింగ్ శాఖ నుంచి రెవెన్యూ శాఖకు భూమి బదలాయించేలా జీవో జారీ చేయ డంతో పాటు రెవెన్యూ రికార్డులను, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా మార్పు చేశారు. జీవో నెం బర్. 124 పేరుతో గత ప్రభుత్వం 2023 మార్చి 20న ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు ప్రతిపాద నలు పంపి ఖరారు చేసి రూ.80 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు అన్ని ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేస్తే పరిపాలనా సౌలభ్యం ఉంటుందని నిర్ణయించారు.

కుట్ర రాజకీయాలు

భవన నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ ఇలా అన్ని పూర్తయితే గత సర్కారు పేరు శాశ్వతంగా నిలిచి పోతుందనే రాజకీయ కక్షతో జిల్లా కేంద్రం మార్పునకు పావులు కదిపారు. దీనికి అనుగుణం గా స్థలాల్ని వెదుకుతున్నారు. ఉండిలో స్థలాలు రెడీగా ఉన్నాయని జిల్లా కేంద్రం తరలిపోతుందని పొలిటికల్ సర్కిళ్లలో ప్రచారం సాగుతుంది.

ఎక్కడైనా చూస్తాం: కలెక్టర్

జిల్లా కేంద్రం మార్పుపై విలేకరులు కలెక్టర్‌ను ప్రశ్నిం చగా.. జీవో రద్దు గురించి ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ప్రభుత్వ భవనాల అవసరాల కోసం స్థలాలు ఎక్కడైనా చూస్తామని చెప్పారు.

తేతలిలో నిరసన శిబిరం భగ్నం



గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్

తణుకు అర్బన్: లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థ నిర్వహిస్తున్న పశు వధ కర్మాగారానికి వ్యతిరేకంగా గత ఏడు రోజులుగా జరుగుతున్న నిరసన శిబిరాన్ని మంగళ వారం పోలీసులు భగ్నం చేశారు. తేతలి వాసులు, గోసేవా సమితి ఆధ్వర్యం లో కర్మాగారం ఎదురుగా ఉన్న ఖాళీస్థలాల్లో టెంట్లు వేసి తేతలి వాసుల ఆరాధ్యదైవం గోగులమ్మ తల్లిని నిలబెట్టుకుని నిరసన శిబిరం కొనసాగించారు. దీనికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరా వుతోపాటు అఖిలపక్షం, పలు సంఘాలు మద్దతు తెలిపాయి. శిబిరం మొదలైన రోజు నుంచి పోలీ సులు ఆ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. మంగళవారం రూరల్ పోలీసుల పిలుపు మేరకు తహసీల్దారు కార్యాలయంలో సమావేశానికి వెళ్లిన గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్‌ను సమావేశం అనంతరం బైండోవర్ చేశారు. తేతలిలో నిరసన శిబిరం టెంట్లు తొలగించారు. ఈ సందర్భం గా గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో రూరల్ ఎస్సై చంద్రశేఖర్ ఫోన్ చేసి రమ్మంటే తణుకు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లానని,, తన వాదన విన్నాక పోలీసులు తహసీల్దారుకు బైండోవర్ చేశారని చెప్పారు. అధికారులు ప్రజలకు సేవ చేయడానికా.. లేక యాజమాన్యానికి వత్తాసు పలికడానికా అని ప్రశ్నించారు. రౌడీల్లా వ్యవహరించి టెంట్లు కూల్చ డంతోపాటు గోగులమ్మ తల్లి విగ్రహాన్ని కూడా అన్యాయంగా తొలగించారన్నారు.


- కొత్త ఏడాదిలోనైనా కూటమి తీరు మారేనా ?

సంక్షేమం తలుపు తట్టేనా ?

సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు.. ఏటా రూ.20 వేలు చొప్పున ఇచ్చి అన్నదాతలను ఆదుకుంటామని నమ్మబలికారు.. తల్లికి వందనంగా ఇంట్లో ఉన్న విద్యార్థులందరికీ ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఇంటింటా చాటారు.. ఆడబిడ్డ నిధిగా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని భరోసా ఇచ్చారు.. నిరుద్యోగు లకు భృతిగా నెలకు రూ.3000 అందిస్తామని హామీ ఇచ్చారు.. ఇవన్నీ జూన్ నుంచే అమలుచేస్తామంటూ బాండ్ పేపర్లు సైతం ఇచ్చిన కూటమి గత ఆరున్నర నెలల పాలనలో చేసింది శూన్యమే. ఏడాదికి మూడని చెప్పి ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు పథకాల ఊసే లేదు. సంక్షేమం జాడలేక జనం అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా ఎన్నికల వాగ్దానాలు నిలుపుకునే దిశగా కూటమి సర్కారు పాలన సాగిస్తుందా? లేక షరా మామూలుగానే మాటలతో మభ్య పెడుతుందా అనే సందేహాలతో జిల్లా ప్రజలు కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు.

అడుగడుగునా వంచన

- ఇప్పటివరకు కూటమి సర్కారు తీరిదే
- సూపర్ సిక్స్ పథకాలతో మభ్యపెట్టి అధికారంలోకి
- తల్లికి వందనం, రైతు భరోసాకు ఎగనామం
- ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సుకు మంగళం
- నిరుద్యోగ భృతి ఊసే లేదు
- కొత్త ఏడాదిలోనైనా సంక్షేమం తలుపు తట్టాలని కోటి ఆశలతో జనం



సాక్షి, భీమవరం: కొత్త ఏడాదికి కోటి ఆశలతో జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. తమ ఇంట అన్నీ శుభాలే కలగాలని ఆకాంక్షిస్తూ కొత్త సంవ త్సర వేడుకలు జరుపుకున్నారు. కర్షక శ్రమ సౌం దర్యంతో పచ్చని తివాచీని తలపిస్తున్న పల్లెలు.. ఇంటి ముంగిళ్లకు శోభను తెస్తూ అతివల ముగ్గు లు.. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కుర్రకారు కేరిం తల నడుమ 2024 స్మృతులను గుండెల్లో పదిల పర్చుకుని కోటి ఆశలతో 2025 వసంతానికి తలుపు తెరిచారు. గత ఏడాది చివరిలో కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులు ఈ ఏడాదిలోనైనా మట్టి బంగారమై తమ ఇంట సిరుల పంట పం డాలని సాగుకు సాయంగా ప్రభుత్వ భరోసా దక్కాలని కోరుకుంటున్నారు. కూటమి ఆరున్నర నెలల పాలనలో జాడలేకుండా పోయిన సంక్షేమ పథకాలు ఈ ఏడాదైనా తమ ఇంటి తలుపు తట్టాలని పేదలు విన్నవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తానని హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల కోసం వేయికళ్లతో ఎదురుచూసిన ప్రజ లకు 2024 సంవత్సరంలో తీవ్ర నిరాశే ఎదురైం ది. కొత్త సంవత్సరంలోనైనా తమ పిల్లల చదు వుల నిమిత్తం సర్కారు 'వందనం' కోసం తల్లు లు.. నెలనెలా ఇస్తామన్న ఆడబిడ్డ నిధి చేతికందా లని, ఉచిత బస్సు ప్రయాణం చేయాలని మహిళ లు.. ఉద్యోగాలు వరించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగులు.. ఇసుక ఇబ్బంది లేకుం డా చేతినిండా పని దొరకాలని భవన నిర్మాణ కార్మికులు ఆశలు పెట్టుకున్నారు.

చల్లారని ధరల మంట...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంటింట్లో రేగిన ధరల మంట ఇంకా చల్లారలేదు. పప్పులు నిప్పులా మండితే.. నూనెల సలసల కాగుతున్నాయి. ఉల్లి ఘాటె క్కింది. ఇతర నిత్యావసరాలు చుక్కలు చూపిస్తు న్నాయి. దీంతో పేద వర్గాలకు పూట గడవడం గగనమైపోయింది. అయినా కూటమి సర్కారు ధరలు తగ్గించేందుకు ఏమాత్రం శ్రద్ధ పెట్టకపోవడం గమనార్హం. కొత్త సంవత్సరంలో నైనా నిత్యావసరాల ధరలు తగ్గాలని పేద, సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

ఉద్యోగం, ఉపాధికి పట్టం కట్టాలని...

ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలిని పరిస్థి తుల్లో గడిపిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భరోసా దక్కాలని ఆశిస్తున్నారు. కనీస వేతనం కోసం ఉద్యమిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సర్కారు కరుణించి తమ సొంతింటి కల పూర్తి కావాలని పేద వర్గాలు ఆశిస్తున్నాయి. కొత్త ఏడాదిలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థి, ఉద్యోగ వర్గాలు, రాజకీయాల్లో రాణిం చాలని నేతలు, తమ డిమాండ్లు నెరవేర్చాలం టూ శ్రామిక వర్గాలు ఆశల పల్లకీలో కొత్త ఏడాదిని స్వాగతించారు.


రైతుల ఆశలు నెరవేర్చాలి



అప్పులు చేసి సార్వా సాగు చేశాం. ఈ ఏడాది నష్టాలు చవి చూశాం. నూతన ఏడాదిలో రైతుల ఆశలు నెరవేరాలని కోరుకుంటున్నాను. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, విత్తనాలు, ఎరువులు తదితర రాయితీలు ఇస్తేనే వ్యవసాయం చేయగలం.

– టి.యోహాన్, కౌలు రైతు, తాడేపల్లిగూడెం

అమ్మఒడి ఇస్తారో.. లేదో?



నాకు ఇద్దరు మనవ రాళ్లు. ఇద్దరికీ అమ్మ ఒడి అందిస్తానని చం ద్రబాబు చెప్పినా నేటికీ ఇవ్వలేదు. ఒక్కొ క్కరికి రూ.20 వేలు ఇస్తానని చెప్పడంతో ఎంతో ఆనందించాం. చేయూత పథకం కూడా అందలేదు.

– మంద వెంకటలక్ష్మి, సిద్ధాపురం

ఎంత నష్టపోయారంటే...

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకాకపోవడంతో ఇప్పటి వరకు జిల్లాలో అర్హత కలిగిన ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఆడబిడ్డ నిధి పథకానికి జిల్లాలో అర్హత కలిగిన మహిళలు సుమారు 5,96,313 మంది ఉండగా నెలకు రూ.1500 చొప్పున ఈ ఆరు నెలలకు రూ.536.68 కోట్లు అందాల్సి ఉంది. ఆ సొమ్మును వారంతా నష్ట పోయారు. తల్లికి వందనం పథకానికి దాదాపు 1,74,763 మంది అర్హు లైన విద్యార్థులుండగా, ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున రూ.262.14 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి సుమారు 1,24,645 మంది రైతులు అర్హులు కాగా రూ.249.29 కోట్లు అందాల్సి ఉంది. జిల్లాలో 5.17 లక్షల కుటుంబాలకు గాను 50 శాతం మందికి పైగా చదువుకు తగిన ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్నారు. తొమ్మిది లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన మార్చి 16వ తేదీ నుంచి సంక్షేమం జాడ లేక జనం అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా ఎన్నికల వాగ్దానాలు నిలుపుకునే దిశగా కూటమి సర్కారు పాలన సాగిస్తుందా? లేక షరా మామూలుగానే మాటలతో మభ్య పెడుతుందా అనేది వేచి చూడాలి.

ప్రజా ఉద్యమంతో అడ్డుకుంటాం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల



భీమవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఉమాబాల, చిత్రంలో పార్టీ నేతలు

భీమవరం: భీమవరం పట్టణంలో అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉన్న కలక్టరేట్‌ను వేరే నియోజకవర్గానికి తరలించాలని చూస్తే సహించేది లేదని, ప్రజా మద్దతుతో దానిని అడ్డుకుని తీరతామని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల స్పష్టం చేశారు. మంగళవారం భీమవరంలో విలేకరుల సమావే శంలో ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్ ఉండి నియోజకవర్గా నికి తరలిపోతోందంటూ ప్రచార మాధ్యమాల్లో విస్తృతం గా ప్రచారం జరుగుతోందని, దీనిపై కేంద్ర మంత్రి భూప తిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనే యులు ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంద న్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అం దరికీ అందుబాటులో ఉండేలా భీమవరాన్ని జిల్లా కేంద్రం గా ఏర్పాటు చేశారని తెలిపారు. శాశ్వత భవనాల నిర్మాణం కోసం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో 16 ఎక రాలు కేటాయించారని గుర్తుచేశారు. కలక్టరేట్ తరలిం పును అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని అడ్డుకుంటా మన్నారు. వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు మాట్లాడుతూ 2022లో భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటుకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎంతగానో కృషి చేశారన్నారు. జిల్లా కేంద్రాన్ని భీమవరంలోనే కొనసాగిం చాలని, లేకుంటే అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎ స్సార్‌సీపీ నేతలు గాదిరాజు రామరాజు, చవ్వాకుల సత్యనా రాయణ, జల్లా కొండయ్య తదితరులు మాట్లాడారు.

దాళ్వా సీజన్‌కు యూరియా రాక

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా సీజన్‌కు కోరమండల్ ఫెర్టి లైజర్స్ కంపెనీకి చెందిన 2,670 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంక టేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఎరువుల ర్యాక్‌లను ఏడీఏతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాళ్వా సీజన్‌కు 2.25 లక్షల ఎకరాల్లో వరి సాగ వుతుందన్నారు. యూరియా 6921 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1332 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 1847 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 8378 మెట్రిక్ టన్నులు అవసరమని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు.



క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన పాదయాత్ర భక్తులు



శ్రీవారి కల్యాణ మండపంలో సేదతీరుతున్న పాదయాత్ర భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రానికి మంగళవారం పాదయాత్ర భక్తులు పోటెత్తారు. ప్రతి ఏటా డిసెంబర్ 31న పినకడిమి వాసులు పెద్ద ఎత్తున క్షేత్రానికి కాలినడకన వస్తారు. వారంతా నూతన సంవత్సరం తొలి రోజు స్వామివారిని దర్శించుకుంటారు. ఈ క్రమంలోనే పినకడిమికి చెందిన వేలాది మంది భక్తులు మంగళవారం కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పాదుకా మండప ప్రాంతంలో ఉన్న స్వామివారి కల్యాణ మండపంలో, అలాగే తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపాల్లో విశ్రాంతి పొందారు. పినకడిమి వాసులతో క్షేత్రంలోని దేవస్థానం, ప్రైవేట్ గదులు పూర్తిగా నిండిపోయాయి. బుధవారం ఉదయం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు. ఇదిలా ఉంటే క్షేత్రంలోని ప్రధాన రహదారులు భక్తులు వాహనాలతో నిండిపోయాయి.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడాది జైలు

భీమవరం అర్బన్: పోక్సో కేసులో ఓ ముద్దాయికి ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. భీమవరం రూరల్ ఎస్సై ఐ వీర్రాజు తెలిపిన వివరాలివి. కొవ్వాడ గ్రామానికి చెందిన కడల లక్ష్మి పెద్ద కుమార్తె ఆరేళ్ల బాలిక సెలవుల నిమిత్తం అమ్మమ్మ ఇంటికి వచ్చింది. 2019 మార్చి 6న ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ముద్దాయి నంబూరి నరసింహారావు బాలికను తన ఇంటిలోకి తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడబోయాడు. బాలిక అమ్మమ్మ చూసి కేకలు వేయడంతో నరసింహారావు పారిపోయాడు. దీనిపై అప్పటి రూరల్ ఎస్సై టి వెంకట సురేష్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసు మంగళవారం విచారణకు రాగా భీమవరం పోక్సో కోర్టులో నేరం రుజువు కావడంతో ముద్దాయి నంబూరి నరసింహారావుకు ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష అమలయ్యేలా కోర్టు తీర్పునిచ్చింది. రూ. 10 వేలు నష్టపరిహారంగా బాధితురాలికి ఇవ్వవలసిందిగా కోర్టు ఆదేశించినట్లు ఎస్సై ఐ వీర్రాజు తెలిపారు.

రెండోరోజూ పోలీస్ కొలువులకు పరీక్షలు

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియ రెండోరోజు మంగళవారం కూడా కొనసాగింది. రెండేళ్ల క్రితం ప్రాథమిక ఎంపిక రాత పరీక్షలు పూర్తి కాగా.. తాజాగా దేహదారుఢ్య పరీక్షలను చేపట్టారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పోటీలను పర్యవేక్షిస్తూ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆయనే స్వయంగా పరిశీలించారు. రెండవరోజు ఎంపికలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 600 మంది పురుష అభ్యర్థులకు హాల్ టిక్కెట్లు జారీ చేశారు. అయితే ఎంపిక పోటీలకు 320 మంది మాత్రమే హాజరుకాగా వారిలో 189 మంది ఎంపికైనట్లు ఎస్పీ శివకిషోర్ చెప్పారు. అభ్యర్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యే సమయంలో తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోటీ పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు.



అభ్యర్థుల సర్టిఫికెట్లను స్వయంగా పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



అభ్యర్థులకు సూచనలు చేస్తూ..



అభ్యర్థి ఎత్తును కొలుస్తున్న సిబ్బంది



సొమ్మసిల్లి పడిపోయిన అభ్యర్థికి చికిత్స అందిస్తున్న వైద్యులు

పారిశ్రామిక అభివృద్ధికి ముందడుగు వేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్రకారం జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి పదిహేను రోజులకొకసారి జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలని అందుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డీఎం డి.నీలాద్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు మంగళవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025వ సంవత్సరంలో అంతా మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలో మంచి పంటలు పండి, విద్యా, పారిశ్రామికపరంగా అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

సమష్టి కృషితో నేరాల అదుపు

- గతేడాదితో పోల్చితే 2024లో పెరిగిన కేసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అద్నాన్ నయీం అస్మి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసు అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో గత ఏడాది జిల్లాలో నేరాలను చేశారని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. మంగళవారం భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో 2024లో కేసుల వివరాలు, దర్యాప్తు, పరోగతి వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయం, వినియోగాన్ని పూర్తిగా చేస్తున్నామని. ఐదుగురు గంజాయి వినియోగదారులు, 33 మంది పెడ్లర్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 40,925 ఈ-చలానా కేసులు నమోదు చేసి రూ. 1,33,62,090 జరిమానా విధించినట్లు చెప్పారు.

పెరిగిన కేసుల సంఖ్య

గత ఏడాదితో పోల్చితే 2024లో నమోదైన కేసుల సంఖ్య పెరిగింది. 2023లో 6,022 కేసులు నమోదుకాగా 2024లో 6,173 కేసులు నమోదయ్యాయి. 2024లో ఆస్తి కోసం మూడు హత్యలు జరిగాయని వివరించారు. 14 దోపిడీ కేసులు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 698 దొంగతనాలు జరగగా వాటిలో 350 కేసులను ఛేదించి సుమారు రూ.3.06 కోట్ల సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. 337 అక్రమ మద్యం కేసుల్లో 349 మంది నిందితుల నుంచి సుమారు 1,319 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. జూదాలకు సంబంధించి 878 కేసులు నమోదుచేసి 3,415 మందిని అదుపులోనికి తీసుకుని రూ. 86.81 లక్షల నగదు, 158 వాహనాలు, 528 పందెం కోళ్లు సీజ్ చేశారు. మోటారు వాహనాల చట్టం కేసుల్లో 61,084 చలానాలకు రూ.1,23,67,300 జరిమానా వసూలు చేశారు.

ప్రధానమైన కేసులు

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉండి మండలం యండగండిలో ఆస్తి కోసం చెక్క పెట్టెలో శవాన్ని పంపించి కేసును ఛేదించడంలో పోలీసులు విజయం సాధించారు. తాడేపల్లిగూడెంలో బంగారం వ్యాపారం చేసే భార్యభర్తలు 33 మంది నుంచి రూ.85 లక్షల విలువైన బంగారం, వెండి తీసుకుని మోసం చేయడానికి ప్రయత్నించగా వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. పాలకొల్లు పట్టణంలో వృద్ధురాలిపై అత్యాచారం, హత్యాయత్నం కేసు, తాడేపల్లిగూడెంలో ఒంటరి మహిళను హత్యచేసి దొంగతనానికి పాల్పడిన కేసు, భీమవరం పట్టణంలో బందిపోటు దొంగతనం కేసులను ఛేదించడంలో పోలీసుశాఖ ప్రతిభ కనబర్చినట్లు ఎస్పీ చెప్పారు. పోలీసు సిబ్బంది కుటుంబాల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. నూతన సంవత్సరంలో పటిష్టంగా పనిచేసి నేరాల అదుపునకు కృషి చేస్తామన్నారు.

బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుదీపిక

నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని బీ ప్రభుదీపిక బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికై నట్లు కోచ్, పీడీ వాకా నాగరాజు తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 12వరకు గుజరాత్‌లోని భావనగర్‌లో నిర్వహించే సీనియర్ జాతీయ స్థాయి బాలికల ఆటల పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుదీపికను పలువురు అభినందించారు.









తెలంగాణ మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

తణుకు అర్బన్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం తణుకు మండలం తేతలి జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో భాగంగా ట్రావెల్స్ బస్సులో హైదరాబాదు నుంచి మద్యం బాటిళ్లను తరలిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రెండు తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యం

కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



'అక్షర' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలందిండమే లక్ష్యంగా పనిచేస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి తనను అధికారులను కలిసేవారు బొకేలు, దుశ్శాలువాలు బదులుగా పుస్తకాలు, పెన్నులు వంటి ఇస్తే బాగుంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ వినూత్నంగా ఆలోచించి ×అక్షర్ణ కార్యక్రమాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్టోరీ బుక్స్ వంటివి అందించాలన్నారు.

జిల్లాల పనితీరులో పశ్చిమకు 2వ ర్యాంకు

2024లో జిల్లా అభివృద్ధి గురించి మాట్లాడుతూ డీసీహెచ్ఎస్‌కు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ ఉత్తమ పనితీరు గుర్తింపు, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి కాయకల్ప అవార్డుల్లో రాష్ట్ర ప్రథమ బహుమతి అందుకున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. జిల్లాల పనితీరులో రాష్ట్రంలో 2వ ర్యాంకు, రాష్ట్ర అభ్యసనా ఫలితాల్లో 5వ ర్యాంకు పొందామన్నారు. జిల్లా స్వచ్ఛతాహీ సేవా అవార్డు 2024 కింద రాష్ట్రంలో ఉత్తమ జిల్లా అవార్డు అందుకున్నామన్నారు. తణుకు మున్సిపాలిటీకి స్వచ్ఛత లక్షిత్ ఎకాయ్ అవార్డు లభించిందన్నారు. తాడేపల్లిగూడెం నిట్‌కు 33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే నర్సాపురం లేస్ పార్క్ జియోట్యాగ్ పొందడం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందన్నారు. పల్లె పండుగ ద్వారా 305 సీసీ రోడ్లు వేశామన్నారు. ఐవీఎఫ్ టెక్నాలజీ ద్వారా మొదటి దేశీయ ఆడ ఒంగోలు జాతీ దూడ జన్మించిందన్నారు. ఖరీఫ్‌లో 62 వేల మంది రైతుల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వారికి సకాలంలోనే రూ.9 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు ప్రారంభించి రూ.51 కోట్లతో 355 పనులు చేపట్టనున్నామన్నారు. 35 హాస్టళ్లకు గాను పునరుద్ధరణ కోసం రూ.129.38 లక్షలతో అభివృద్ధి పనులు చేయనున్నామన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.12 లక్షలతో 24 హెక్టార్లలో హైబ్రిడ్ కూరగాయల సాగు ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిగూడెంలో చైన్ స్నాచింగ్

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో చైన్‌స్నాచింగ్ కేసు నమోదైంది. దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపిన వివరాలివి. అక్కిరెడ్డిగూడెంకు చెందిన మహిళ మంగళవారం ఉదయం బయట నుంచి ఇంటికి వస్తుండగా మోటారుసైకిల్‌పై ఒక వ్యక్తి వచ్చి ఆమె మెడలో మూడున్నర కాసుల బంగారం గొలుసు లాక్కెళ్లాడు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివాజీ చెప్పారు.

రాళ్లకుంటలో కేబుల్ వైర్ల చోరీ



ధ్వంసం చేసిన ఫ్యూజ్ క్యారియర్‌లు



మోటారుకు కట్ చేసిన కేబుల్‌వైరు

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంటలో సోమవారం అర్ధరాత్రి 10 మందికి పైగా రైతుల వ్యవసాయ భూముల్లో బోర్లు మోటార్లకు ఉన్న విద్యుత్ కేబుళ్లను కట్‌చేసి, చోరీ చేశారు. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ఇది గుర్తించి లబోదిబోమంటున్నారు. అలాగే గ్రామ పంచాయతీకి చెందిన మంచినీటి బోరు మోటారు కేబుల్ సైతం చోరీకి గురి కావడంతో, ఉదయం పంచాయతీ అధికారులు కొత్త కేబుల్ వైర్లను అమర్చి, ప్రజలకు తాగునీటిని సరఫరా చేశారు. ఇదిలా ఉంటే చోరీకి పాల్పడిన వ్యక్తులు విద్యుత్ ఫ్యూజ్ క్యారియర్‌లను ధ్వంసం చేశారు. ఒక్కో ఫ్యూజ్ క్యారియర్ విలువ రూ.4 వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు. కేబుల్ వైర్ల దొంగలు కారణంగా తమకు కంటిమీద కునుకు ఉండటం లేదని, పొలాలు, తోటల్లోని విద్యుత్ కేబుల్ వైర్లను ఎలా కాపలా కాసుకోవాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. కేబుల్ వైర్లు దొంగలిస్తున్న కేటుగాళ్లను పోలీసులు పట్టుకుని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: అంతర్ జిల్లా దొంగల ముఠాను ఏలూరు జిల్లా నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ అధికారులు పట్టుకున్నారు. రూ.కోటి 62 లక్షల విలువైన 2 కిలోల బంగారు ఆభరణాలు, 13 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. ఏలూరు ఇందిరమ్మకాలనీకి చెందిన తేళ్ళ యేసు, గండిపూడి రాజకుమార్ అలియాస్ నాని, పెదపాడు మండలం వేంపాడుకుకు చెందిన సాయల రాంబాబు, ఏలూరు వంగాయగూడెంకు చెందిన దాసరి బాలరాజు అలియాస్ బాలయేసు, ఏలూరు దక్షిణపువీధికి చెందిన వేముల యేసు ముఠాగా ఏర్పడి గత కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాను ఈనెల 30న ముసునూరు మండలం గుల్లపూడి అడ్డరోడ్డు వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.

43 ఇళ్లలో చోరీలు

ఏలూరు నగరానికి చెందిన తేళ్ళ యేసు 2007-2016 మధ్య కాలంలో 18 కేసుల్లో నిందితుడిగా ఉంటూ జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం నేరాలకు పాల్పడకుండా ఆటో నడుపుతూ జీవనం సాగించాడు. మళ్లీ 2021 నుంచీ ఇళ్లల్లో చోరీలకు పాల్పడటం ప్రారంభించారు. ఈ ముఠా మొత్తం 43 ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ విచారణలో తేలింది. నూజివీడు సర్కిల్ పరిధిలో-11, పెదవేగి సర్కిల్ పరిధిలో -11, ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో-5, పోలవరం సబ్ డివిజన్‌లో -1, ఏలూరు జిల్లాలో మొత్తంగా 28 చోట్ల చోరీలు చేశారు. కృష్ణాజిల్లాలో -12, తూర్పుగోదావరి జిల్లాలో - 3 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ కేపీ శివకిషోర్ తెలిపారు. దొంగల ముఠాను పట్టుకోవటంలో ప్రతిభ చూపిన నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, నూజివీడు రూరల్ సీఐ కే.రామకృష్ణ, ముసునూరు ఎస్సై ఎం.చిరంజీవి, చాట్రాయి ఎస్సై రామకృష్ణ, నూజివీడు రూరల్ ఎస్సై ఎం.లక్ష్మణ్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావును ఎస్పీ శివకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ హేలాపురి గ్రాండ్ ఏలూరు-కలపర్రు పాత టోల్ ప్లాజా ప్రక్కన 187 చ॥గ॥లో 2 బెడ్‌రూమ్ ఇండివిడ్యువల్ హౌసెస్ రెడీ టూ ఆక్యుపే అమ్మకం బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. సంప్ర: 9963738618 [C-800148]

Services

BUSINESS OFFER

■ టైలరింగ్ వర్క్ షాప్ ఫ్రాంచేంజ్‌గా ఇన్వెస్ట్‌మెంట్ చేసేవారు కావలెను. నెలనెల పనికి తగ్గ ఆదాయం కల్గును. ఫోన్ : 90007 92363, 70936 32399 [V-823984]

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2587]



SALE OR LEASE

■ వాటర్‌ప్లాంట్ సేల్ / లీజు 30 BPM రన్నింగ్ కండీషన్‌లో గల వాటర్ ప్లాంట్ సేల్ /లీజుకు ఇవ్వబడును. రాజమండ్రి - సంప్ర॥ ✆ : 96664 07069 [R-909]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99434]

■ రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe.జీ+కమీషన్+2వీలర్+రూం+భో ఫ్రీ, Age : 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15242]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నూతన సంవత్సర సందడి

- రద్దీగా మారిన రహదారులు
- కిక్కిరిసిన కేకులు, పండ్లు, బొకేలు, మాంసాహార దుకాణాలు



తాడేపల్లిగూడెం రూరల్: మార్కెట్‌లో చికెన్ వంటకాల విక్రయం



తణుకు అర్బన్: కేకుల బేకరీ వద్ద కొనుగోళ్ల సందడి

తణుకు అర్బన్: నూతన సంవత్సర వేడుకలు తణుకులో అంబరాన్నంటాయి. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ యువత సంబరాలు చేసుకున్నారు. గ్రీటింగ్స్ కార్డు కొనుగోలు చేస్తూ విద్యార్థులు నూతన సంవత్సర శుభాకాంక్షల పర్వం కోసం తణుకు పట్టణం సందడిగా మారింది. ఈ నేపథ్యంలో కేకులు, స్వీట్స్, పండ్లు దుకాణాలు రద్దీగా మారాయి. ముఖ్యంగా కేకుల అమ్మకాలు జోరుగా సాగాయి. అంతే కాకుండా ఫ్లవర్ దుకాణాలు, బొకేలు అమ్మేందుకు దుకాణాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు కేకులు, పండ్లు, బొకేలు కొనుగోలు చేసేందుకు అధికసంఖ్యలో రోడ్లపైకి రావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా రకరకాల మాంసాహారం, బిర్యానీల అమ్మకాలు జోరుగా జరిగాయి. మాంసాహారులను ఆకర్షించేందుకు వివిధ ఆఫర్లు, ఫ్యామిలీ ప్యాక్‌లతో ప్రత్యేక అమ్మకాలకు తెరతీశారు. దీంతో రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, నరేంద్రసెంటర్ ప్రాంతాలు విపరీతమైన రద్దీగా మారాయి. నూతన సంవత్సర వేడుకలంటే పిల్లల పండుగ కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలతో సహా మార్కెట్‌కు వచ్చి కొనుగోళ్లు చేశారు.

న్యూ ఇయర్ వేడుకలకు సన్నద్ధం

తాడేపల్లిగూడెం: కొత్త కొత్తగా ఉన్నది స్వర్గమిక్కడే అన్నదనే భ్రమల్లో ఏడాది అంతం రోజున హాయిని ఆస్వాదిస్తూ ఆశల ఊసుల్లో కొత్తకొత్త ఆశలతో కొత్త ఏడాదిలో అడుగిడాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు. లక్ష్యాలను ఏర్పరచుకొని ఆ దిశగా సంతోషంగా సరదాగా అడుగులు వేయాలని ప్రతి ఒక్కరూ అభిలషిస్తారు. ఇలాంటి ఆశల ఊసుల ఊహల్లో తేలుతూ బుధవారం కొత్త సంవత్సర సంరంభాలు జరుపుకోడానికి వాతావరణం సిద్ధమైంది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొత్త ఆశలతో ఉన్నారు. గడచిన ఏడాది ప్రజలు ఊహించినవి సంక్షేమ ఫలాలు సూపర్ సిక్స్ రూపంలో అందలేదు. వచ్చే ఏడాది నుంచి అయ్యినా ఈ పథకాలు తమ ముంగిటకు రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన వర్గాలు ఆశించిన మేర అభివృద్ధిని సాధించలేకపోయాం. వచ్చే రోజుల్లోనైనా సంక్షేమ బాట పట్టాలని భావిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న వారు సమస్యల పరిష్కారంలో ప్రజాపక్షం వహించాలని, కష్ట నష్టాలలో ఆయా వర్గాల వెన్నంటి ఉండాలని కోరుకుంటున్నారు. ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలనే ఉత్సాహపూరిత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు చిరస్మరణీయంగా జరుపుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. అన్ని వర్గాల ఆకాంక్షలు, కోరికలు, ఆశయాలు నెరవేరాలని కోరుకుందాం.

నాయకుల ఇళ్ల వద్ద న్యూ ఇయర్ వేడుకల ఏర్పాట్లు

మాజీ దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంటు వడ్డి రఘురాం ఇళ్ల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేశారు. అభిమానులు, శ్రేణుల కోసం అల్పాహారాలు, భోజనాల ఏర్పాట్లు చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలు వెలవెలబోయినట్లు కనిపిస్తోంది. ఏటా 31వ తేది సాయంత్రం తాడేపల్లిగూడెం మార్కెట్ పండ్లు, పువ్వులు, పూల దండలు, కేక్‌లు వంటి వాటిని కొనుగోలు చేసే వారితో రద్దీగా ఉండేది. దానికి భిన్నంగా ఈ ఏడాది కొనుగోలుదారులు లేక షాపులు వెలవెలబోయాయి. ధరలు అందుబాటులో ఉన్నా కొనుగోలుదారులు లేక వ్యాపార నిర్వాహకులు నీరసించారు. వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగాయని వ్యాపారులు నిట్టూరుస్తున్నారు.

క్లుప్తంగా

నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మేలు చేకూరాలి



కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

తణుకు అర్బన్: నూతన సంవత్సరం తణుకు నియోజకవర్గ రైతులు, ప్రజలతో పాటు ప్రతి ఒక్కరికీ, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని శాంతి, సమానత్వంతో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించాలని మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరం వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతమవుతుందని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ అభిమానులు పార్టీ అభివృద్ధికి మరింతగా కష్టపడి పని చేయాలని ఆయన తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



బల్లిపాడులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బల్లిపాడు శ్రీమదనగోపాల్ స్కూల్‌లో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల నుండి వచ్చిన మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు పాఠశాల డైరెక్టర్ తిరు పతి శ్రీనివాస్, జయదుర్గా భవాని బహుమతు లు అందజేసారు.వైస్ ప్రిన్సిపాల్ నీలం అనిత, తిరుపతి గీత, ప్రధాన ఉపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న కోచ్ శివకుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో అండర్ -17 విభాగంలో తాడేపల్లిగూడెం ద్రోణాచార్య స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు కటికితల చరిత్, సంకు షణ్ముక సంతోష్‌లు పతకాలు సాధించారు. చరిత్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, సంతోష్ కాంస్య పతకం సాధించారు. విజేతలను కోచ్ శివకుమార్, క్రీడాకారులు అభినందించారు.

నేటి నుంచి పుంతలో ముసలమ్మ వార్షికోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో పుంతలో ముసలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు 1వ తేదీ బుధవారం నుంచి 5వ తేదీ ఆదివారం వరకు అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయని యువఫ్రైండ్స్ సర్కిల్ అధ్యక్షుడు రాజా త్రినాథ్ వెల్లడించారు. 1వ తేదీన లలితా సహస్ర పారాయణం, 2వ తేదీన శ్రీ వినాయక కల్యాణం, గానామృతం, 3వ తేదీన శ్రీ శ్రీనివాస కల్యాణం, 4వ తేదీన సహస్ర దీప లింగార్చన, 5వ తేదీన రథోత్సవం, 10వ తేదీన అఖండ అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు హాజరై అమ్మవారిని దర్శించాలని కోరారు. యువఫ్రైండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



తణుకులో లక్కీ డిప్ తీస్తున్న సీఐ కొండయ్య తదితరులు

తణుకు అర్బన్: ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రయాణికులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు పట్టణ సీఐ ఎస్.కొండయ్య అన్నారు. డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా డిపోలో మంగళవారం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలకు సంబంధించి లక్కీ డిప్ డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం ఎంత సురక్షితమో కార్గో పార్సిల్స్ కూడా అంతే సురక్షితంగా ఇంటికి చేరుతాయని అన్నారు. అనంతరం ఆరుగురు ప్రయాణికులను విజేతలుగా ఎంపికచేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డు బ్యాంకు మేనేజరు కాకిలేటి రాజేంద్ర ప్రసాద్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ దయాకర్, ఏడీసీ అలీ, జనరల్ ఏడీసీ రామకృష్ణ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఎస్‌డీఐ కల్యాణ్‌రాజు, ఉద్యోగులు ములగాల వెంకటరత్నం, కె.దుర్గాప్రసాద్, డిపో, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



తణుకులో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: మండల న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది కౌరు.వెంకటేశ్వర్లు, మండల న్యాయ సేవల కమిటీ ప్యానెల్ న్యాయవాది ఎ. అజయ్ కుమార్ మంగళవారం తణుకు జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ చట్టాల్లో భాగంగా మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు నిరోధక చట్టం, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా, ఉచిత న్యాయ సహాయం అనే అంశాల పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం తోట వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

తణుకు అర్బన్: పెన్షనర్ల శ్రేయస్సు కోసం అసోసియేషన్ ఎల్లప్పుడూ పనిచేస్తుందని, భవిష్యత్తులో కూడా అదే ఒరవడిని కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏ) తణుకు యూనిట్ అధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు అన్నారు. అసోసియేషన్ భవనంలో మంగళవారం నూతన కమిటీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎన్నికల అధికారి ఎస్‌వీఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాయల నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.చలపతిరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా డీవీ రామకృష్ణరాజు, కోశాధికారిగా ముత్యాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జి.జోషఫ్, డి.బాపిరెడ్డి, పి.సత్యనారాయణమూర్తి, ఎం.అబ్రహాం పలువురు ప్రమాణస్వీకారం చేశారు.

క్రీస్తు మార్గంతో నూతన శకంలోకి వెళ్లాలి

పెంటపాడు: క్రీస్తు మార్గంతో నూతన శకంలోకి ప్రవేశించాలని తణుకు ఇమ్మానియేలు ప్రార్థనామందిరంలో దైవసేవకులు పి. మోజస్ ప్రవీణ్ తెలిపారు. నూతన సంవత్సరంలో దేవుని ఇష్టులుగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గత మూడు రోజుల నుంచి జరుగుతున్న సంవత్సరాంత సభలు ముగిసాయి. ముగింపు పురస్కరించుకొని ప్రభుసంస్కార భోజనాన్ని దైవసేవకులు మోజస్ ప్రవీణ్ భక్తులకు అందజేశారు. అన్ని దీవెలనకు ఆధారమైన దేవ దేవుని ప్రతీ ఒక్కరూ కొలచి సంతోషంగా జీవించాలని సేవకులు పి. అరుణకుమారి, ఫ్రెజీ ప్రవీణలు దేవుని వాక్యం బోధించారు. గూడెం టౌన్‌లూథరన్ సేంటినరీ చర్చిలో గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్, సహాయ గురుమండల అధ్యక్షుడు రత్నాకర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక సంవత్సరాంత ప్రార్థనలు జరిగాయి. కొవ్వొతులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాచర్ల రూపాంతర చర్చి, మీనవిల్లూరు ఏసయ్యా ప్రార్థనామందిరం, బాగ్యలక్ష్మీపేట ఎల్‌ఎల్‌ఎం చర్చిలో పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు, కొండయిచెరువు ప్రాంతంలోని ఫెయిత్ చర్చి తదితర ప్రాంతాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.

మోటారు సైకిల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్థానిక మోటారు సైకిల్ మెకానిక్ ఓనర్స్ అండ్ వర్క ర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక మంగళవారం పట్టణంలో జరిగింది. అధ్యక్షుడిగా నల్ల మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా కసిలంక మహంకాళి, సెక్రటరీగా కెల్లా సత్యనారాయణ ప్రసాద్, కోశాధికారిగా పాన్నాడ సత్యనారాయణ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా చిటకని శ్రీనులు ఎంపికయ్యారు. పసు పులేటి సత్యనారాయణ, కొమ్మిశెట్టి వెంకట రాజు, జోగి వెంకటేశ్వరరావు, కర్రి వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

అత్తిలి: మండలంలోని లక్ష్మినారాయణపురం గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ స్వరాజ్యలక్ష్మి చెప్పారు. తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అత్తిలి మండలం లక్ష్మినారాయణ గ్రామంలో దాడులు చేయగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ముద్దాయిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 23 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. ఈదాడులలో తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపు

అత్తిలి: అయ్యప్పస్వామి ఆభరణాలు ఊరేగింపు ఉత్సవం మంగళవారం అత్తిలిలో వైభవంగా నిర్వహించారు. అత్తిలి ఉమాసిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలోగల అయ్యప్పస్వామి దేవాలయం నుంచి స్వామివారి ఆభరణాల పెట్టెను మేళతాళాలు, పేటతుళ్లి ఆడుతూ అయ్యప్ప భక్తులు గ్రామంలో ఊరేగింపు ఉత్సవం జరిపారు. గురుస్వామి ఇంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆభరణాల ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

అత్తిలి: భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దశిక వంశీ కోరారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై అభ్యంతరాల గడువు పెంపు

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కుల గణనపై అభ్యంతరాల స్వీకరణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని జిల్లా సంక్షేమ, సాధికారిత అధికారి కే. రామాంజనేయరాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఈ మేరకు తాడేపల్లిగూడెంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 7వ తేది వరకు అభ్యంతరాల గడువు పొడిగించిందన్నారు. జనవరి 17న కులగణన తుది జాబితాను సచివాలయాల వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు.































